



బలవంతాన భర్తచేత చొక్కా తొడిగించింది శ్యామల. కాస్త దగ్గరగా జరిగి చొక్కా గుండీలు పెట్టింది.

"అసలు, అన్నయ్య ఎందుకు నాన్చుతున్నాడంటారు? మనమిక ఆలస్యంచేస్తే లాభంలేదు! అవునో, కాదో వెంటనే తేల్చెయ్యాలి! ఆయన అమెరికాలో కోట్లు–కోట్లు గడించాడని ఊళ్ళో అంతా చెప్పుకుంటున్నారు. యెలాగైనా సరే, యివాళే మీరు నలుగురు పెద్దమనుషుల్ని పిలుచుకురండి! అందరిముందు అడిగేసి, వత్తిడిచేస్తే కాదంటాడా మేనరికం? ఎవంటారు?" కాలరు సవరించి అంది.

"నువ్వు చెప్పేదిబాగానేవుంది. కానీ, ఒకాడపిల్ల తండ్రిని...?" భర్త చెయ్యి మీసాలమీదికి పోయింది.

"చాల్లెండి ! మీవన్నీ బడాయిలు ! ఆయనేం పరాయివాడా ? స్వయాన నాకు అన్నయ్య ! ఎంత ఆడపిల్ల తండ్రే అయినా, అమెరికాలో ఆయన కోటీశ్వరుడండీ! ఆయన కున్న ఆస్తి-పాస్తులు, పేరు-ప్రతిష్ఠల ముందు మన మేపాటి వారమండీ ? మీరిలా కుంటి సాకులు చెబుతూ ఆలస్యంచేస్తే, యీ అవకాశం మళ్ళీ రాదు ! యే అదృష్ట వంతులో యెగరేసుకుపోతారు ! తెలిసిందా ?" కాస్త గట్టిగానే చెప్పింది శ్యామల.

అంతలో బయటినుండి కిశోర్ వచ్చాడు. ఈమధ్యే అతను ఎం.ఎస్‌సి. ఫస్ట్‌క్లాస్‌తోపాటు డిస్టింక్షన్ సంపాయించాడు. అతనికే మేనరికంచేసి, అమెరికాలో రిసెర్చి చేయించాలని తల్లి-తండ్రుల ఉబలాటం ! అందుకు అతను కూడా అంగీకరించాడు.

"మీరు త్వరగా తెమలండి ! పుల్లయ్య బాబాయినీ, వెంకయ్య మావయ్యనీ, రామయ్యనీ, రంగయ్యనీ, శాస్త్రిగారినీ యేకంగా పిలుచుకురండి ! ఒకేసారి లగ్నపత్రిక వ్రాసేట్టుండాలి ! తెలిసిందా ? ఇక పదండి !" భర్తని మారు మాటాడనీయకుండా బయటికి సాగనంపసాగింది శ్యామల.

"ఎందుకమ్మా ? పెళ్ళి సెటిల్ చెయ్యడానికా ?" కిశోర్ అడిగాడు.

"అవున్రా ! మీ మామయ్య వచ్చి అప్పుడే వారం దాటినా, యింతవరకు యే సంగతీ తేలలేదాయె !" శ్యామల అంది.

"అస లదేమిటమ్మా ఆయన అలా మాట్లాడుతారు ? 'మీలాగే అమెరికా వచ్చి సెటిల్ అవ్వాలనుంది మామయ్యా' అంటే, నావంక యెగాదిగా జూచి, 'డోంట్ డ్రీమిట్ ! ఇటీజ్ ఇంపాజిబుల్' అన్నారు. 'వై నాట్' అని నే నడిగితే మళ్ళీ సమాధానమే చెప్పలేదు !" కిశోర్ చెప్పాడు.

"అన్నాడూ?... నాకు తెలుసురా ! ఆయనకు మనం మనుషుల్లా కనబడుతున్నామా ? యే దేవలోకంనించో దిగి వచ్చినట్టు బిర్రబిగుసుకు నుంటున్నాడు. విన్నావుటే మీ అన్నగారి నిర్వాకం ? 'అమెరికా రావడం నీవల్లకాదు; పిచ్చి-పిచ్చికలలు కనద్దు' అన్నాట్ట!" శ్యామల భర్త అన్నాడు.

"అంతమాటే ? ... అయినా, నా కొడుకు అంత చాతకానివాడనా ఆయన ఉద్దేశం ? అమెరికా రావడం నీవల్ల కాదంటాడా ? ఎందుకు కాదో నేనూ చూస్తాను. తన కూతుర్ని యివ్వకపోతే, ఆ సంగతే తిన్నగా చెప్పాలిగానీ, అడ్డగోలుగా అంటాడా ? యేమైనా సరే, యీ విషయమేమిటో యీ రోజు తేల్చు

కోవల్సిందే! ముందు మీరు వెళ్ళి, వాళ్ళందర్నీ పిలుచుకురండి! పదండి, పదండి!" భర్తని పురమాయించి, పంపింది.

'పిల్ల నివ్వకపోతే పోయాడు, నీవల్ల కాదంటాడా?' శ్యామల ఒకటికి రెండుమార్లు అనుకొని బాధపడింది.

* * *

అటు పల్లెకి, యిటు బస్తీకి చెందని ఊరు రేపల్లె! ఆ ఊళ్ళో పరపతిగల ఆసామి గోపాలరావు. అతని భార్య శ్యామల. వారికి నలుగురు సంతానం. ఇద్దరాడపిల్లలకి, ఒక మగపిల్లవాడికి పెళ్ళిళ్ళు చేశారు. ఆఖరివాడే కిశోర్. స్టేట్స్‌కి వెళ్ళి రిసెర్చి చెయ్యాలన్నది అతని ఆశయం.

అమెరికాలో స్థిరపడిపోయిన డాక్టర్ సుధాకరరావు శ్యామలకు స్వయాన అన్నయ్య. అమెరికాలోని స్పేస్ రిసెర్చి సెంటర్‌లో మంచి సైంటిస్ట్‌గా పేరుపొందాడాయన.

ఆయనకు ఒక కొడుకు, కూతురు. ఎప్పుడో వాళ్ళకు ఊహ తెలీనపుడు ఒక్కసారి భారతదేశానికి వచ్చి వెళ్ళారు. మళ్ళీ భారతదేశాన్ని వారు చూడనేలేదు. అమెరికా పౌరసత్వం పొంది, అక్కడే స్థిరపడిపోయారు సుధాకరరావు దంపతులు. ఆయనకు భార్యంటే మహాప్రేమ. ఈ మధ్యనే యెప్పుడో ఆమె పోయిందట! కూతురు, కొడుకు కూడా చదువుకుంటూ, 'ఉద్యోగాలు చేసుకుంటున్నారట! ఎంత కలవారి బిడ్డలకైనా, యిది సహజమట, ఆ దేశంలో!

ఉత్తరం ముక్కయినా వ్రాయకుండా అకస్మాత్తుగా ఊడిపడ్డాడు సుధాకరరావు. వచ్చికూడా వారమైంది. ఎందుకొచ్చాడో, యేమిటో చెప్పలేదు. యెప్పుడు వెళ్తాడో తెలీదు. ముభావంగా వుంటున్నాడు. ఒకసారి పాండిచేరి అరవిందాశ్రమానికి వెళ్లొచ్చాడు.

ఉదయానే లేచి, 'మార్నింగ్ వాక్' వెళతాడు. వచ్చి పాలు, ఆమ్లెట్ తీసుకుంటాడు స్నానంచేసి పేపర్లు, పుస్తకాలు చూస్తాడు. ఒంటిగంటకు భోంచేసి లైబ్రరీకి వెళతాడు. నాలుగ్గంటలకొచ్చి, సాండ్‌విచ్, ఓవల్‌టీన్ తీసుకొని, ఓ గంట యీజీఛైర్‌లో నడుం వాలుస్తాడు. మళ్ళీ అయిదుకు లేచి, పొలాల గట్లకి షికారు వెళతాడు. రాత్రి తొమ్మిదింటికి వచ్చి ఆమ్లెట్, పాలు, పళ్ళు తీసుకొని విశ్రమిస్తాడు. తానెందుకు వచ్చాడో, తన ఆంతర్యమేమిటో ఎవ్వరికీ చెప్పలేదు. పెళ్ళి విషయంగానీ, తన కుటుంబ సంగతులుగానీ మాట్లాడడంలేదు. అడగడానికి అవకాశం యివ్వడంలేదు. అలాగని అంత గొప్ప మేనరికాన్ని ఎలా వదులుకోవడం? అందుకే అన్నిటికీ ఓర్పు వహించి, యెలాగైనా సంబంధాన్ని

ఖాయపరచాలని శ్యామల విశ్వ ప్రయత్నం చేస్తోంది.

* * *

శ్యామల చెప్పినట్టే భర్త పెద్దమనుషులను, శాస్త్రిగారిని వెంటబెట్టుకొచ్చాడు. అందరికీ కాఫీ, ఫలహారా లిచ్చారు. అప్పటికే యీజీఛైర్‌లో విశ్రాంతి తీసుకుంటున్నాడు సుధాకరరావు. అందరూ ఆయనున్న గదికి వచ్చి, నమస్కరించి, చుట్టూ కూర్చున్నారు, సోఫా, కుర్చీలు, మోడాలమీద.

తలా ఓ రకంగా పలకరించి, పరామర్శించారు. శ్యామల గడప కానుకొని నిల్చుంది. గోపాలరావు సోఫాలో హుందాగా కూర్చున్నాడు. భార్యా-భర్తలు ప్రవేశపెట్టిన పాత్రలు 'నాటకం' ప్రారంభించాయి.

కిశోర్ అమెరికాలో సెటిల్ అవ్వడంలోని వుద్దేశాన్ని విడమరిచి చెప్పారు. మేనరికాన్ని విడిచిపెట్టడానికి వీల్లేదన్నారు. కట్నం పుచ్చుకోకుండా పెళ్ళి చేసుకుంటానని 'శపథం'చేసిన విద్యార్థి బృందానికి నాయకుడు 'కిశోర్' అని చెప్పారు. కిశోర్ గుణగణాలను, విద్యాభివృద్ధిని కొనియాడారు. అలాంటి ఆదర్శపురుషుడు యీ 'అమెరికా సంబంధం' చేసుకోవడం దేవతలు మెచ్చే విషయమన్నారు. బ్రహ్మ లిఖితం అన్నారు. ఇంకేవేవో రకరకాల పదాలు పలికారు ! ఆఖరికి శాస్త్రిగారిని లగ్నాలుకూడా చూడమన్నారు.


కానీ, 'యీ అభినయం, సంభాషణం సుధాకరరావు వింటున్నాడా ?' అన్న సందేహం గోపాలరావుతోపాటు, మరికొందరికి కూడా కలగకపోలేదు !

సుధాకరరావు చూపులు ఎక్కడో కేంద్రీకృతమై వున్నాయి. 'ఊఁ' అనిగానీ 'ఆ' అనిగానీ అనలేదు. 'ఏమి టీ వాలకం ?'

అంతలో విగ్రహం కదిలినట్లు. సుధాకరరావు కదిలి, కాస్త సర్దుకొని కూర్చున్నాడు. అందరివంకా నిదానంగా చూశాడు. అతని చూపులో గంభీరత ప్రస్ఫుటించింది బరువుగా నిట్టూర్చాడు.

"జలాశయంలా కనిపించేవి, నిజమైన నీటిమడుగులు కావు ! అవి కేవలం యెండమావులు ! వోన్లీ మిరేజస్ !" సుధాకరరావు ప్రారంభించాడు. అప్పటివరకు మాట్లాడిన వారంతా మౌనం వహించారు.

"ఈ సంగతి మీలో చాలమందికి తెలిసినా, యెడారిని చూసినవారికే అవి అనుభవమవుతాయి. లైక్ మీ పీపుల్ ! అలాగే, మనకు దూరంగా ఆకాశంలో కనిపించే ఆ తెల్లని, చల్లని చంద్రుడు ప్రాణికోటి జీవించడానికి పనికివస్తాడంటారా?... నాటెటాల్ యూస్‌ఫుల్ ! యెంతమాత్రమూ పనికిరాడు !"




పెళ్ళి పెద్దలంతా ముఖముఖాలు చూసుకున్నారు. 'మనం ప్రారంభించిన విషయమేమిటి ? ఈయన చెప్పే దేమిటి ?...'

"ఇదంతా తెలిసికూడా ఎవరైనా చంద్రమండలానికి 'హనీమూన్' కి వెళ్తామంటే, మన కెంత హాస్యాస్పదంగా వుంటుందో, 'అమెరికాలో సెటిల్ అవ్వాలి' అనే యువతరాన్ని చూసినా, నా కలాగే వుంటుంది !" అందరి ముఖాలవంక పరిశీలనగా చూశాడు సుధాకరరావు.

యెవ్వరికీ ఆ మాటలు రుచించినట్టు లేవు.

"భలేవారండి మీరు !" శాస్త్రి అందుకున్నాడు. "నేతి మిఠాయిని చూస్తే మాకు నోరూరుతుంది. రోజూ తినేవాళ్ళకి మొహం మొత్తుతుంది. అంతమాత్రాన మమ్మల్ని 'తినకండి' అనడం భావ్యమా ? సెలవియ్యండి తమరే !"

"బాగా చెప్పారు శాస్త్రిగారూ!" రంగయ్య అందుకున్నాడు. "అయినా అవేం మాటలు సుధాకరం బావగారూ ? ఒక్కొక్కరిదీ ఒక్కోరకమైన అభిరుచి ! మనం 'దూరపు కొండలు నునుపు' అన్నంతమాత్రాన, యువతరం వూరుకుంటుందా ? ... హిమాలయాలు సైతం యెక్కి జండాలు పాతడం లేదూ ? అంతే ! ఎటు వెళ్ళదలచుకున్నవాళ్ళని అటు పోనివ్వవలసిందే ! ఆ పైన ఎవరి అదృష్టం వారిది!"

"నిజమేనండీ ! నేటి యువతరానికి మనం అడ్డుచెప్పరాదు !" సమర్థించాడు రామయ్య.

"చూడు సుధాకరం ! నీకన్నా వయస్సులో పెద్దవాడిని నేను. ఈ మాటలన్నీ అనవసరం ! ఒక్క టడుగు తానుచెప్పు! అసలు కిశోర్‌కి పిల్లనివ్వడం నీకు యిష్టమా, కాదా ?" పుల్లయ్య అడిగాడు.

ఓ క్షణం తలవంచుకున్నాడు సుధాకరరావు. భారంగా ఊపిరి తీసుకున్నాడు.

"కిశోర్‌కి మా అమ్మాయిని యివ్వడమే మీ అందరికీ ముఖ్యమనుకుంటే, నా కెలాంటి అభ్యంతరంలేదు పుల్లయ్య బాబాయ్ !" గంభీరంగా అన్నాడు సుధాకరరావు.

"అద్గదీ సంగతి !" వెంకయ్య అందుకున్నాడు. "శాస్త్రీ ! యిక చూసెయ్యవయ్యా లగ్నాలు !"

శాస్త్రి తక్షణం పంచాంగం తెరిచి, గాలించసాగాడు.

"నే నీ దేశం విడిచి పాతికేళ్ళు పైబడింది ! ఈలోగా, యింటా-బయటా కూడా అనేకరకాల మార్పులొచ్చాయి. ఎంత స్వంతమైనా, వియ్యమందుకో బోతున్నాం కనుక, నా గురించి రెండు ముక్కలు ముందుగానే మనవి చేసుకోవడం నా ధర్మం బాబాయ్ !" సుధాకరరావు అన్నాడు.

గోపాలరావు శాస్త్రివంక చూచి, 'నువ్వు కానియ్యవయ్యా!' అన్నట్టు కన్ను గీటాడు.

"రవి, సంధ్య పుట్టిన తర్వాతే మేము అమెరికాలో స్థిరపడ్డాం. !" సుధాకరరావు ప్రారంభించాడు. "ఇప్పుడు రవికి యిరవై, సంధ్యకి పద్దెనిమిదేళ్ళ వయస్సు ! రవి యింజనీరింగ్, సంధ్య మెడిసిన్ చదువుతున్నారు.

"మేము ప్రతివారం మిగతా అమెరికన్లలాగే, 'వీక్‌యెండ్స్'కి యెక్కడికైనా వెళుతుండేవాళ్ళం ! మాతోనే వచ్చి, పిల్లలుకూడా సరదాగా గడిపేవారు.

మా భోజనపు అలవాట్లు కూడా క్రమేపీ మారాయి. పళ్ళు, బ్రెడ్, చికెన్, మటన్, బీఫ్ వగైరాలు తీసుకుంటున్నాము. మా పిల్లలకి యివి బాగా నచ్చాయి. కేక్‌లు, బిస్కట్లు రోజూ కావాలి !

అక్కడి వాతావరణాన్నిబట్టి బీరు, బ్రాందీ, విస్కీ వగైరాలు తీసుకోడం ప్రారంభించాము. పిల్లలు కూడా సిప్ చేస్తూంటారు.

వాళ్ళు పెద్దవాళ్ళయ్యేకొద్దీ, మాతో పాటు 'వీక్‌యెండ్స్'కి రావడం తగ్గించి తమ-తమ మిత్రబృందాలతో వెళ్ళడం మొదలెట్టారు. డాన్స్, సంగీతం నేర్చు

కున్నారు. తరచూ నైట్ క్లబ్బులకి వెళుతుంటారు.

"రవికి బాయ్‌ఫ్రెండ్స్‌తోపాటు గర్ల్ ఫ్రెండ్స్ కూడా వున్నారు. అలాగే సంధ్యకి కూడా. ఈ రోజుకి కూడా సంధ్య చీరె కట్టలేదు ! వారికి తెలుగు రాదు ! అదంటే యెందుకో యిష్ట పడదు !"

క్లబ్‌లో అలవాటైందట సిగ రెట్లు కాల్చడం. దానిని యిద్దరూ సరదాగా అలవాటు చేసుకున్నారు. మా మాటలు వారు లెక్క-చెయ్యలేదు ! పైగా, ఓ రోజు నన్ను 'డోంట్ బి సిల్లీ డాడీ !' అన్నారు." సుధాకరరావు ఎక్క-డో చూస్తూ చెప్పుకుపోతున్నాడు. అతని ముఖంలో నెత్తురు యింకిపోయి నట్లు పేలవమైంది.

"నిజమే ! మందలించడం 'సిల్లీ'నే మరి ! ఇది ఆధునిక యుగం ! దే ఆర్ యంగ్ అండ్ మాడరన్ ! దే ఆర్ మూవింగ్ విత్ ది మాడరన్ సొసైటీ!" ఓ క్షణం ఆగి, జేబురుమాలుతో ముఖం తుడుచుకున్నాడు సుధాకరరావు.

శాస్త్రి పంచాంగం పేజీల మధ్య చూపుడువేలు యిరికించి, మూసి, నోరు తెరిచి మరీ వింటున్నాడు. మిగతావారి ముఖాల్లో అల్లంముక్క-ను కొరికినంత ఫీలింగ్ వచ్చింది.

సుధాకరరావు మళ్ళీ ప్రారంభిం చాడు.

"వాళ్ళ నడిగితే 'మేము అమెరికన్స్' మంటారు ! తల్లి-దండ్రులు మాత్రమే యిండియన్సట ! కానీ, వారు మాత్రం 'దరిద్రపు యిండియన్స్' కారట ! ఇది కేవలం అమెరికాలో జరిగే దుష్ప్రచార ప్రభావమంటే తప్పులేదు! ఇటీజ్ బాడ్‌లక్!...

"అమెరికాలో యువతీ-యువకులు సాధారణంగా క్లబ్బులకి, వొపేరాస్‌కి వెళ్ళి, తిరిగి తిన్నగా యిళ్ళకు రావడం అరుదు. తరచూ మిగిలిన రాత్రంతా బాయ్‌ఫ్రెండ్‌తోనూ, గర్ల్‌ఫ్రెండ్‌తోను గడిపి, తెల్లవారి యిళ్ళకి చేరుతుంటారు! ఇది అక్క-డి యువత కున్నటువంటి స్వేచ్ఛ ! అది మనకైతే ఆక్షేపణగానీ, అమెరికన్లకి కాదు !

"అమ్మాయి, అబ్బాయి కలిసి తిరగవచ్చు ! డాన్స్‌లూ, పార్టీలూ, యింకా-యింకా వాళ్ళ కోరికలకు తగిన పనులేవైనా చేసుకోవచ్చు ! ఒకరి కొకరు బాగా నచ్చితే, అప్పుడు తల్లి దండ్రుల కా సంగతి చెప్పి, పెళ్ళి చేసు కోవచ్చు ! లేదనుకుంటే, మళ్ళీ యింకె వరితోనైనా స్నేహం ప్రారంభించ వచ్చు !

"గర్భస్రావం అతి సూక్ష్మమైన విషయం అక్క-డ ! ఆ జంటకి నచ్చక పోతే అబార్షన్ చేయించుకొని, మళ్ళీ కొత్త స్నేహం చేసుకోవచ్చు ! ఇది వారి పద్ధతి ! మరి ... అనేక రకాల

కట్టుబాట్లతో వుండే భారతీయ జీవన విధానం దీని కెంతో విరుద్ధం ! ...

"అందుకే, డబ్బూ-చదువూ వున్న మన భారతీయులకి కూడా గుండెల్లో జవనాశ్వాలు ఎగిరెగిరి పడుతుంటే, అమెరికాలో వాటిని స్వేచ్ఛగా తిరగ నివ్వవచ్చు ! అక్కడ శీలాన్ని గురించి అంతగా పట్టించుకోరు ! మరి, 'మేము భారతీయులం కాదు, అమెరికన్లమే !' అనుకొనే భారతీయుల గురించి ప్రత్యేకంగా మీకేం చెప్పను?... నా కూతురు, కొడుకు కూడా 'మేము భారతీయులం కాదు' అంటున్నారన్న విషయం మీకు చెప్పడం నా ధర్మం !" అని కుర్చీలో వెనక్కువాలి, కళ్ళు మూసుకున్నాడు, పెద్దగా నిట్టూర్చి.

అందరి మనసులు కాస్తంత కలవరపడ్డాయి. శాస్త్రి పంచాంగం సంచీలో పెట్టి, చిటికెలేస్తూ ఆవులించి, 'నారాయణ' అనుకున్నాడు మంద స్వరంలో.

"అదేం మాటలే అన్నయ్యా ! అందరూ అలా ఎందుకుంటారు ? అగ్నిహోత్రంలాంటి వంశం మనది !" శ్యామల సమర్ధించింది.

"అవునవును. ఐసుగడ్డ పెడితే సరి !" భర్త దెప్పిపొడిచాడు.

ఇవన్నీ పట్టించుకున్నట్టు లేడు సుధాకరరావు. కళ్ళు మూసుకొని గతాన్ని చూస్తున్నాడేమో, మళ్ళీ ప్రారంభించాడు.

"నేనోసారి లాస్‌ఏంజిల్స్‌కి వెళ్లాను, పనిమీద. తిరిగి రావడానికి నాల్రోజులు పట్టింది. తీరా యింటికొస్తే యిల్లు తాళంవేసి వుంది. మా ఆవిడ కనిపించ లేదు. తాళంతీసి, లోపల చూసాను. ఇల్లు రెండుమూడ్రోజులనుంచి వూడ్చినట్టులేదు. పిల్లలు 'వీక్‌యెండ్'కి వెళ్ళి వుంటారు. మరి వాళ్ళమ్మ యెక్కడికెళ్ళినట్టు ?

"నాకేమీ అంతుపట్టక, పక్క అపార్ట్‌మెంట్‌లో అడిగాను. కిందటి శుక్రవారం సాయంత్రం ఆమెకు 'హార్ట్ యెటాక్' వస్తే, అంబులెన్స్ వచ్చి, హాస్పిటల్‌కి తీసుకెళ్ళిందట ! తర్వాత యేమైందో తెలీదన్నారు."

"నేను గజగజ లాడిపోయాను. వెంటనే హాస్పిటల్‌కి ఫోన్ చేశాను. వారు పిడుగుపాటులాంటి వార్త చెప్పారు. నా గుండెలు బ్రద్దలయ్యాయి! నా భార్య హాస్పిటల్లో చేరిన అయిదు నిమిషాలకే శాశ్వతంగా కన్నుమూసిందట ! నన్ను వదిలి వెళ్ళిపోయింది !" ...సుధాకరరావు కంఠం వణికింది. దుఃఖం సంతరించుకుంది. చెంపల మీదుగా రెండు కన్నీటిబొట్లు దొర్లిపోయాయి.

"ఈ ఘోరమైన విషయాన్ని వెంటనే మా అమ్మాయికీ, అబ్బాయికీ

తెలిపారట ! వారెక్కడ 'షాక్' అయిపోయారో అని భయపడ్డాను. కానీ, అలాంటిదేమీ జరగలేదు ! యేవో 'వీ యెండ్' ప్రోగ్రామ్స్ వేసుకున్నారట ! అందువల్ల కన్నతల్లి శవాన్ని తీసుకెళ్ళి క్రిమేట్‌చేసే టైమ్ లేదట ! సోమవారంగానీ, మంగళవారంగానీ వచ్చి, చూస్తామన్నారట !"

"రక్తం పంచి, జన్మ నిచ్చిన ఆ మాతృమూర్తిని చూడటానికైనా నా బిడ్డలు వెళ్లలేదు ! వాళ్లకి టైమ్‌లేదు ! ...అదే భారతీయుడైతే, కన్న తల్లే కాదు, యే బంధువైనా, స్నేహితుడైనా పోయినట్టు తెలిస్తే, అలా విడిచిపెట్టి పోతాడా ? ఆ దుఃఖంలో క్రుంగిపోకుండా వుంటాడా ? కులాసాలకి, విలాసాలకి పోతాడా ? ... తల్లి మరణానికి రవ్వంతైనా బాధపడకుండా, వారి విలాసాలకి భంగమని భావించారు నా బిడ్డలు !"

"ఇదా తల్లిపట్ల ఓ కుమారుడి బాధ్యత ? కొడుకుచేత తల కొరివి పెట్టించుకోవాలనుకొనే భారతీయ మాతకి యిదా ప్రతిఫలం ? శవాన్ని హాస్పిటల్లో పారేసి, తమ సుఖాలకి బానిసలయ్యే పిల్లలు మనుషులేనా ?... ఇదమ్మా నా బిడ్డలు అమెరికాలో పెరిగి అలవరుచుకొన్న సంస్కారం !

"అదే యిక్కడ జరిగితే మీ రెవరైనా అంగీకరిస్తారా ? వూరుకుంటారా? ... అంతా మా ఖర్మం!... ఆ రోజే నా భార్య శవాన్ని నేనే హాస్పిటల్‌నుండి తెచ్చుకొని, నాకు బిడ్డలే పుట్టలేదనుకొని, నేనే దహనసంస్కారం చేశాను బాబాయ్ ! నా భార్యని మన్ను చేశాను !" సుధాకరరావు రెండు చేతులతో ముఖం కప్పుకొని, భోరున యేడ్చాడు

పుల్లయ్య పై పంచెతో కళ్లు వొత్తుకున్నాడు. శ్యామల నోటికి గుడ్డ అడ్డం పెట్టుకుంది. ఆమె కన్నులు అశ్రుపూరితాలయ్యాయి.

"అంతా అయ్యాక మరునాటి వుదయం అంటే మంగళవారం, నా కొడుకు, కూతురు వచ్చారు. ఏడుస్తున్న నన్ను చూసి, 'సారీ డాడీ—సారీ' అన్నారు. సంతాపం వ్యక్తపరిచి, ధైర్యం చెప్పారు...నన్ను మళ్ళీ పెళ్ళిచేసుకోమన్నారు బాబాయ్ ! మళ్ళీ పెళ్ళాడమన్నారు, నా బిడ్డలు !... మైగాడ్ ?? నేనేం చెయ్యను ?? ... 'చనిపోయిన తల్లిని దహనం చెయ్యాల్సిన శ్రమ తప్పించావు' అంటూ, నా బిడ్డలు 'థాంక్సు' చెప్పారమ్మా... నాకు థాంక్సుచెప్పారు శ్యామలా !..." పసిపిల్లవాడిలా విలపించాడు సుధాకరరావు.

శ్యామల కూడా ఓర్పు కోల్పోయి, అన్నతోపాటే యేడ్చేసింది. గోపాలరావు కంగారుపడి, ఆమెను ఓదార్చడానికి ప్రయత్నించాడు.

"ఆనాటినుండి వాళ్ళ ముఖం చూడా

లంటే నాకు అసహ్యం మనిపించేది ! అందుకే ఆస్తులన్నీ వాళ్ళ కప్పగించి, రెండు లక్షలు నా పేరుతో బాంక్ చేసి, శాశ్వతంగా ఆ దేశాన్నీ, వారినీ విడిచి వచ్చేశాను ! ఇప్పుడు నాకు బిడ్డలు లేరు ! బంధాలు లేవు ! నే వంటరి వాడిని ! అన్నీ కోల్పోయినవాడిని !"

"ఐహిక సుఖాలే ముఖ్యమనుకొనే దేశ మది ! ఆ దేశంలో స్థిరపడాలన్న వ్యామోహం యింకా మీకుంటే వెళ్ళండి ! అది మీ ఖర్మ ! అక్కడ మోహం తప్ప ప్రేమ లేదు! ఆశ తప్ప తృప్తిలేదు !! ఆందోళన తప్ప ఆత్మ శాంతిలేదు !!! అదే ముఖ్యమనుకుంటే వెళ్ళండి."

"సైన్సు అభివృద్ధి చెందింది ! కాబట్టి, పై చదువుల కెళ్ళండి! పరిశోధనలు చేయండి ! ఉద్యోగాలు చేయండి ! పేరు – ప్రతిష్ఠలు పొందండి ! డబ్బు సంపాయించండి ! కానీ, మీ సంస్కృతిని విడకండి ! మీ జాతీయతని కోల్పోకండి ! మీ సాంప్రదాయాలని మరవకండి !"

"అమ్మా ! శ్యామలా ! 'అమెరికా సంబంధం' గురించి నువ్వూ, బావ గారూ, యింకా మన పెద్దలూ బాగా ఆలోచించి నిర్ణయించుకోండి ! మీకే కాదు. యావన్మంది భారతీయులకి నా యదార్థ జీవితమే ప్రమాణం ! ఆలోచించుకోండి ! శాస్త్రిగారూ ! మీరు కూడా !"

సుధాకరరావు మాటలు విని, అంతా లేచారు.

"మేరేజస్ ఆర్ మేడిన్ హెవెన్ అన్నారేగానీ, అమెరికా అన్నారా శ్యామలమ్మా ? మీ అబ్బాయికి పెళ్ళాం మన దేశంలోనే యెక్కడో ఓ చోట పుట్టే వుంటుంది. ఇక అవిడని గాలిద్దాం! యేమంటారు ?" అంటూ శాస్త్రి బయటికి సాగాడు.

"అమెరికా సంబంధానికి ఓ నమస్కారం. వస్తామండి !" రామయ్య బయటికి నడిచాడు.

"శ్యామలా ! నీకు లక్షరూపాయలు, అరవిందాశ్రమానికి ఓ లక్షరూపాయలిచ్చి, నేను ఆ ఆశ్రమానికే వెళ్ళిపోతానమ్మా !" సుధాకరరావు అన్నాడు.

"వద్దన్నయ్యా ! అలా అనొద్దు అన్నయ్యా ! నువ్విక్కడే ఉండు ! నన్ను క్షమించన్నయ్యా !" యేడ్చింది శ్యామల.

"క్షమించు బావా ! నీ హృదయం యింతటి క్షోభకు గురైందని తెలీక నిన్ను బాధపెట్టాము. అమెరికామీదున్న వ్యామోహంకొద్దీ ఆశించామే తప్ప, నిజానిజాలు తెలుసుకోలేదు ! నీ డబ్బంతా అరవిందాశ్రమానికి యిచ్చినా ఫర్వాలేదు. నువ్వుమాత్రం మాతోనే వుండిపోవాలి !" అంటూ గోపాలరావు డాక్టర్ సుధాకరరావు చేతులు పట్టుకున్నాడు.